కూరగాయల ధరలు

శేరిలింగంపల్లి: నల్లగండ్ల మార్కెట్‌లో వివిధ కూరగాయల ధరలు ఈ విధంగా ఉన్నాయి. టమాట కిలో రూ. 20, పచ్చిమిర్చి 45, బెండ 45, కాకర 50, దొండ 50, దోస 40, ఆలు 35, చామ 50, కీర 35, బీర 50, వంకాయ 30, గోకర 50, బీన్స్‌ 60, బీట్‌రూట్‌ 50, క్యాప్సికమ్‌ 60, క్యాబేజీ 20, క్యారెట్‌ 50, చిక్కుడు 50, ఉల్లి 60(కేజీ), ములక్కాయలు (1) 10, క్యాలీఫ్లవర్‌ (1) 30, సొరకాయ (కేజీ) 20, అల్లం 80, వెల్లుల్లి 400 ప్రకారం ధర పలుకుతున్నాయి.

నేడు విద్యుత్‌ ఉండని ప్రాంతాలు

గచ్చిబౌలి: విద్యుత్‌ సంబంధ మరమ్మతు పనుల కారణంగా ఆదివారం పలు ప్రాంతాల్లో విద్యుత్‌ సరఫరా నిలిపివేయనున్నట్లు కొండాపూర్‌ ఏఈ ఎస్‌.రంగారెడ్డి తెలిపారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు జాగృతి ఫీడర్‌ పరిధిలోని ఆనంద్‌నగర్‌, శ్రీనివాస కాలనీ, వీకర్‌ సెక్షన్‌, జాగృతి కాలనీ తదితర ప్రాంతాలలో విద్యుత్‌ సరఫరా ఉండదన్నారు.

మయూరినగర్‌ సబ్‌ స్టేషన్‌ పరిధిలో..

మియాపూర్‌: మయూరినగర్‌ సబ్‌ స్టేషన్‌ పరిధిలో పలు ప్రాంతాల్లో ఆదివారం విద్యుత్‌ సరఫరాను నిలిపివేస్తామని ఏఈ రవిచంద్ర తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు దివ్యశక్తి ఫీడర్‌ పరిధిలోని దివ్యశక్తి అపార్ట్‌మెంట్స్‌, రాంనరేష్‌ నగర్‌, హైదర్‌నగర్‌ విలేజ్‌, మిత్ర హిల్స్‌, ఏఎస్‌ రాజు నగర్‌, ప్రశాంత్‌నగర్‌లలో విద్యుత్‌ ఉండదన్నారు. మయూరి నగర్‌ ఫీడర్‌ పరిధిలోని ఎస్‌బిఐ బ్యాంకు లైన్‌, మయూరినగర్‌ విద్యుత్‌ ఉండదన్నారు. ప్రశాంత్‌ నగర్‌ ఫీడర్‌ పరిధిలోని మయూరినగర్‌, ఓల్డే జ్‌హోం, ఇంద్రమ్మ హౌస్స్‌, వాటర్‌ ట్యాంకు–2, గోకరాజు రంగరాజు కళాశాల రోడ్డు, కేటీఆర్‌ కాలనీ, నిజాంపేట్‌, ఆర్‌డీటీ కోకనట్‌ గ్రో, బ్రో వెంచర్‌ ప్రాంతాలలో విద్యుత్‌ సరఫరా నిలిపివేస్తామని ఏఈ వివరించారు.

ఆ లింకులతో జరజాగ్రత్త

డీఎస్పీ వేణుగోపాల్‌ రెడ్డి



పటాన్‌చెరు టౌన్‌: నూతన సంవత్సరం, పండుగ శుభాకాంక్షల పేరుతో వచ్చే లింక్‌లపై క్లిక్‌ చేయకూడదని సైబర్‌ సెక్యూరిటీ బ్యూరో డీఎస్పీ వేణుగోపాల్‌ రెడ్డి శనివారం ప్రజలను హెచ్చరించారు. నూతన సంవత్సర వేడుకలకు ముందు సైబర్‌ నేరగాళ్లు శుభాకాంక్షలు, బహుమతుల కోసం లింక్‌లను సోషల్‌ మీడియా వేదికగా లేదా మెసేజ్‌ల రూపంలో పంపుతారని అప్రమత్తంగా ఉండాలని హితవుపలికారు. ఈ రకమైన లింక్‌లో మాల్వేర్‌ ఉంటుందన్నారు. గ్రీటింగ్‌లు, బహుమతులకు సంబంధించిన నకిలీ లింక్‌లపై క్లిక్‌ చేయకూడదని హెచ్చరించారు. ఏదైనా సైబర్‌ క్రైమ్‌ జరిగితే గంటలోపే 1930 కు కాల్‌ చేసి సమాచారం ఇస్తే నగదు ఫ్రీజ్‌ అయ్యే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన

జిన్నారం (పటాన్‌చెరు): బొల్లారం మున్సిపాలిటీ పరిధిలోని 9వ వార్డు కేటీఆర్‌ కాలనీలోని సీసీ రోడ్డు పనులను శనివారం చైర్‌ పర్సన్‌ కొలన్‌ రోజా పరిశీలించారు. నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ త్వరితగతిన పూర్తిచేసి అందుబాటులోకి తీసుకురావాలని కాంట్రాక్టర్‌ సూచించారు.

గండి చెరువు ఎఫ్‌టీఎల్‌ తనిఖీ

జిన్నారం (పటాన్‌చెరు): జిన్నారం మండలం, కాజిపల్లి గ్రామం గండి చెరువు ఫుల్‌ ట్యాంక్‌ లెవెల్‌ సమస్యలపై ఫిర్యాదు అందుకున్న నీటి పారుదల శాఖ, పీసీబీ అధికారులు శనివారం గ్రామంలో పర్యటించి చెరువును పరిశీలించారు. ఇరిగేషన్‌ డిప్యూటీ ఈఈ రామస్వామి, ఏఈ ప్రసాద్‌ సమక్షంలో పీసీబీ అధికారి రవీందర్‌ చెరువులోని నీటి నమూనాలను సేకరించారు. గండి చెరువు ఎఫ్‌ టీఎల్‌ పరిధి రైతుల జీవనోపాధిపై ప్రభావం చూపుతుందని స్థానిక ఆర్‌కే ఫౌండేషన్‌ చైర్మన్‌ దండే రమాకాంత్‌, నాయకులు నవీన్‌కుమార్‌ అధికారులకు విన్నవించారు. ఎఫ్‌టీఎల్‌ సామర్థ్యాన్ని తగ్గించి రెవెన్యూ రికార్డుల నుంచి తొలగించాలని కోరారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు, జేఏసీ సభ్యులు సయ్యద్‌ రఫీ, రాజులు, మహేష్‌, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి సాయం



మెట్టుకుమార్‌తో ఆలయ కమిటీ సభ్యులు

జిన్నారం (పటాన్‌చెరు): జిన్నారం మండల కేంద్రంలో నూతనంగా నిర్మిస్తున్న పోచమ్మ ఆలయ నిర్మాణానికి దాతలు విరాళాలు అందజేశారు. శనివారం పటాన్‌చెరు కార్పొరేటర్‌ మెట్టు కుమార్‌ యాదవ్‌ లక్ష రూపాయలు, తెల్లాపూర్‌ మున్సిపల్‌ చైర్‌ పర్సన్‌ లలిత సోమిరెడ్డి ఒకటిన్నర టన్నుల స్టీల్‌, ఐలాపూర్‌ బీఆర్‌ఎస్‌ నేత మణిక్‌ యాదవ్‌ 150 బస్తాల సిమెంట్‌ అందజేశారు. ఆలయ అభివృద్ధికి సంపూర్ణ సహకారం అందించేందుకు కృషి చేసిన దాతలను కమిటీ సభ్యులు ఘనంగా సన్మానించి ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్‌ రాష్ట్ర యువత నాయకులు వెంకటేశం గౌడ్‌, శ్రీనివాస్‌ రెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

చెత్త షిఫ్టింగ్‌ యార్డ్‌ తొలగించరా?

దశాబ్దాలు గడిచినా తొలగించని వైనం

- 15 కాలనీలు, అపార్ట్‌మెంట్‌వాసులకు తీవ్ర ఇబ్బందులు
- దుర్వాసనతో రోగాల బారిన పడుతున్నామంటూ ఆందోళన
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధుల తీరుపై సర్వత్రా ఆగ్రహం



మియాపూర్‌: కాలనీ పరిసర ప్రాంతాల నుంచి చెత్త షిఫ్టింగ్‌ డంపింగ్‌ యార్డ్‌తో పరిసర కాలనీల్లోని ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ చెత్త షిఫ్టింగ్‌ యార్డ్‌ను తొలగించాలని కాలనీ వాసులు పలుమార్లు అధికారులకు ప్రజాప్రతినిధులకు వినతి పత్రాలు అందజేసినా పట్టించుకునే నాథుడే లేడు. మొదట్లో డంపింగ్‌ యార్డ్‌గా ఉన్న దీన్నికాస్తా ప్రస్తుతం షిఫ్టింగ్‌ యార్డ్‌గా మార్చారు.

- మదీనాగూడ దీప్తిశ్రీనగర్‌ సమీపంలో ఉన్న సర్వే నంబర్‌–100, 101లలో భూమి ఉంది. ఈ భూమి న్యాయస్థానంలో వివాదంలో ఉంది. ఈ ఖాళీ స్థలంలో డంపింగ్‌ యార్డ్‌ ఏర్పాటు చేశారు. మొదట్లో డంపింగ్‌ యార్డ్‌గానే ఉన్న ఈ ప్రాంతాన్ని క్రమేపీ షిఫ్టింగ్‌ యార్డ్‌గా మార్చారు. దీనివల్ల ఉత్పన్నం అవుతున్న ఇబ్బందులు, సమస్యలను భరించలేని పరిసర ప్రాంతాల ప్రజలు దాన్ని తొలగించాలని అధికారులు, ప్రజాప్రతినిధులకు ఫిర్యాదులు చేశారు.
- నిత్యం పరిసర కాలనీల నుంచి సుమారు 120 వాహనాలలో చెత్తను ఇక్కడికి తీసుకొచ్చి మరలా ఇక్కడి నుంచి భారీ వాహనాలలో చెత్తను జవహర్‌నగర్‌కు తరలిస్తారు. 800 నుంచి 1200 వరకు ఆటో రిక్షాలలో చెత్తను ఇతర ప్రాంతాల నుంచి ఇక్కడికి తీసుకొస్తారు. ఖాళీ ప్రదేశంలో చెత్తను వేసి అందులో ఉన్న ఇనుప, ప్లాస్టిక్‌ బాటిళ్లు, ఇతరత్రా సామగ్రిని తీసుకుని చెత్తను అక్కడే చెల్లాచెదురుగా వదిలేసి వెళ్తున్నారు. షిఫ్టింగ్‌ యార్డ్‌కు వచ్చే వాహనాల వల్ల శబ్ద కాలుష్యంతో రాత్రి వేళల్లో కంటి మీద కునుకులేకుండా పోతున్నదని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



ధర్నా చేస్తున్న దీప్తిశ్రీనగర్‌వాసులు (ఫైల్‌)



కాలనీవాసులు ఏర్పాటు చేసిన బ్యానర్‌

సమస్యలివీ..

చెత్త షిఫ్టింగ్‌ యార్డ్‌లో ప్లాస్టిక్‌ కవర్లు, దుమ్ము ధూళి, చెత్తాచెదారం రోడ్లపై పడి కాలనీ పరిస్థితి గందరగోళంగా మారుతోంది.

- చెత్త తరలించే ఆటో రిక్షాలు నడిపే డ్రైవర్లు 18 సంవత్సరాలలోపు డ్రైవింగ్‌ లైసెన్స్‌ లేకుండానే వాహనాలను నడుపుతున్నారు. అడ్డదిడ్డంగా ఆటోలు నడపడంతో కాలనీ రోడ్లపై ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి.
- అధిక సంఖ్యలో వాహనాలు రాత్రి, పగలు అనే తేడా లేకుండా తిరుగుతుండటంతో వాయు, శబ్ద కాలుష్యం ఏర్పడుతున్నది.
- చెత్తను ఎప్పటికప్పుడు పూర్తిగా తరలించకపోవడంతో దాని నుంచి వెలువడుతున్న దుర్గంధాన్ని భరించలేకపోతున్నారు. దీంతో దోమలు, ఈగలు ఇతరత్రా కీటకాలు వృద్ధి చెంది స్థానికులు రోగాల బారిన పడుతున్నారు.
- వీధి కుక్కల బెడద కూడా అధికం అవుతోంది. అవి స్థానికులను వెంటపడి కరుస్తున్నాయి.
- చెత్త ఆటోలలో నిర్ణీత చెత్త కంటే అధికంగా తీసుకొస్తున్నారు. ఆటోలకు పైభాగంలో కవర్‌ వేయకుండానే చెత్తను తరలిస్తున్నారు. ఈ కారణంగా చెత్త రోడ్లపై పడిపోతోంది. దీంతో వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుంది.
- వర్షా కాలంలో వరద దీప్తిశ్రీనగర్‌ కాలనీ సమీపంలో ఉన్న చెరువులోకి వెళ్లేది. కలుషిత నీటికి చెరువులోని చేపలు భారీ సంఖ్యలో చనిపోయాయి.



దీప్తిశ్రీనగర్‌ కాలనీలోని చెత్త షిఫ్టింగ్‌ యార్డ్‌

హామీల అమలులో విఫలం

గతంలో పలుమార్లు చెత్త షిఫ్టింగ్‌ యార్డ్‌ వల్ల తలెత్తుతున్న సమస్యలపై అధికారులకు ఫిర్యాదు చేశాము. ఆందోళనలూ నిర్వహించాము. ఆందోళన చేసిన ప్రతిసారీ అధికారులు వచ్చి తొలగిస్తామని హామీ ఇచ్చి వెళ్తున్నారు. అయినా చెత్త షిఫ్టింగ్‌ యార్డును మాత్రం తొలగించడం లేదు. చెత్త షిఫ్టింగ్‌ యార్డ్‌ నుంచి తీవ్ర దుర్గంధం వెదజల్లుతుంది. ఇకనైనా సంబంధిత ఉన్నతాధికారులు స్పందించకపోతే పెద్ద ఎత్తున ఆందోళనలు నిర్వహించి కాలనీలోంచి వెళ్లే చెత్త తరలించే వాహనాలను అడ్డుకుంటాం.

– బబ్లు, దీప్తిశ్రీనగర్‌ కాలనీ

విద్యార్థులు అవకాశాలను అందిపుచ్చుకోవాలి

రాయదుర్గం: భారతదేశంలో బహుళ అవకాశాలు ఉంటాయని, వాటిని విద్యార్థులు అందిపుచ్చుకోవాలని ఇంటర్నేషనల్‌ స్టార్టప్‌ ఫౌండేషన్‌ వ్యవస్థాపకుడు, చైర్మన్‌ డాక్టర్‌ జేపీ చౌదరి పేర్కొన్నారు. గచ్చిబౌలి డివిజన్‌ గోపన్‌పల్లిలోని సెయింట్‌ జేవియర్స్‌ పీజీ కళాశాలలో అట్టహాసంగా శనివారం 'గ్రాడ్యుయేషన్‌ డే' కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమాన్ని ఆయన జ్యోతి వెలిగించి ప్రారంభించారు. టీబీటీసీఎస్‌ వ్యవస్థాపకుడు సీఈఓ డాక్టర్‌ శ్రీనివాస్‌ భూసారపు మాట్లాడుతూ... యువత వినూత్న ఆలోచనలు కలిగి ఉండాలన్నారు. దేశాన్ని డిజిటల్‌ ఆర్థిక వ్యవస్థగా మార్చడంపై కూడా దృష్టి సారించడంపై తమదైన శైలిలో ప్రయత్నించాలన్నారు. అనంతరం అతిథులు డాక్టర్‌ జేపీ చౌదరి, డాక్టర్‌ శ్రీనివాస్‌ భూసారపు, కళాశాల ఉపాధ్యక్షుడు పి అశోక్‌గౌడ్‌ చేతుల మీదుగా 2022–24వ బ్యాచ్‌ ఎంబీఏ విద్యార్థులకు సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. అనంతరం అతిథులకు మెమెంటోలను అందించారు. ఫ్యాకల్టీ ప్రతినిధులు డాక్టర్‌ డి.శ్రీలత, కె.శ్వేత, కె.భారతి, నాన్‌ టీచింగ్‌ స్టాఫ్‌ రాజు, మూర్తి, జయలక్ష్మీ, ఎంబీఏ విద్యార్థులు పాల్గొన్నారు.



గ్రాడ్యుయేషన్‌ డేలో సర్టిఫికెట్లు పొందిన ఎంబీఏ విద్యార్థులతో అతిథులు

పీజేఆర్‌కు నివాళి

శేరిలింగంపల్లి: సీఎల్పీ మాజీ నేత స్వర్గీయ పి.జనార్ధన్‌రెడ్డి వర్ధంతిని శేరిలింగంపల్లి పాపిరెడ్డినగర్‌లో శనివారం ఘనంగా నిర్వహించారు. పాపిరెడ్డినగర్‌లో పీజేఆర్‌ విగ్రహానికి కాలనీ అధ్యక్షుడు బద్దం కొండల్‌రెడ్డి పూల మాలలు వేసి నివాళర్పించారు. ఈ సందర్భంగా కొండల్‌రెడ్డి మాట్లాడుతూ... పేదల పెన్నిధి పీజేఆర్‌ అని కొనియాడారు. బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి నిరంతరం కృషి చేశారని గుర్తు చేశారు. కాలనీ అసోసియేషన్‌ ప్రతినిధులు లింగారెడ్డి, రాంబాబు, ఎం.రమేష్‌, వేణుగోపాల్‌రెడ్డి, ఎస్పీ రెడ్డి, రమణయ్య, కె.రమేష్‌, కుమార్‌ గుప్తా, ఎం.కొండల్‌రెడ్డి, ప్రవీణ్‌ గుప్తా, కాశీనాథ్‌గుప్తా తదితరులు పాల్గొన్నారు.

పేదల పెన్నిధి పీజేఆర్‌

చందానగర్‌: పేద ప్రజల పెన్నిధి దివంగత పి.జనార్ధన్‌రెడ్డి అని కాంగ్రెస్‌ పార్టీ శేరిలింగంపల్లి నియోజకవర్గం ఇంచార్జి జగదీశ్వర్‌ గౌడ్‌, ఎంబీసీ చైర్మన్‌ జెరిపేటి జైపాల్‌ అన్నారు. పీజేఆర్‌ వర్ధంతి సందర్భంగా హఫీజ్‌పేట్‌ డివిజన్‌ పరిధిలని గంగారంలోని ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళుర్పించారు. కార్యక్రమంలో నాయకులు టి.కృష్ణ, నల్ల సంజీవరెడ్డి, సునీత ప్రభాకర్‌రెడ్డి, ఉరిటి వెంకట్రావు, శేఖర్‌ తదితరులు పాల్గొన్నారు.



హఫీజ్‌పేట్‌లో కాంగ్రెస్‌ ఇంచార్జి జగదీశ్వర్‌ గౌడ్‌, ఎంబీసీ చైర్మన్‌ జైపాల్‌..



పీజేఆర్‌ విగ్రహానికి నివాళర్పిస్తున్న కొండల్‌రెడ్డి తదితరులు

అంకితభావంతో కృషి చేస్తే లక్ష్య సాధన



సెమినార్‌ను ప్రారంభిస్తున్న అతిథులు

చందానగర్‌: మహిళ దక్షత సమితి విద్యా సంస్థలు ఆధ్వర్యంలో చందానగర్‌ గంగారంలోని సుమన్‌ కళాశాలలో విజయానికి స్ఫూర్తిగా ఉండండి అనే అంశంపై సెమినార్‌ నిర్వహించారు. ఈ సెమినార్‌కు ముఖ్య అతిథులుగా కిమ్స్‌ హాస్పిటల్‌ సీనియర్‌ కార్డియాలజిస్ట్‌ డాక్టర్‌ జివానీ, ఫౌండర్‌, పార్టనర్‌ అసిస్టెంట్‌ కన్సల్టింగ్‌ అబ్రాడ్‌ స్టడీస్‌ పూనం యార్లగడ్డ, సీనియర్‌ చార్టర్డ్‌ అకౌంటెంట్‌, ఫైనాన్షియల్‌ అడ్వైజర్‌ వి.ఎస్‌.గణేష్‌, వివాజీ, సతీష్‌కుమార్‌ సంఘీ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ఉపాధి పొందాలంటే విద్య ప్రధాన రంగం, అంతకంటే ముందుగా మనం లక్ష్యాన్ని నిర్దేశించుకోవాలన్నారు. మనం అనుకున్నది మాత్రమే సాధించగలమన్నారు. మన సామర్థ్యంపై మాత్రమే ఆధారపడి ఉంటుందని, ప్రతి ఒక్కరూ అక్కడికి చేరుకోవడానికి మీ కోసం లక్ష్యాలను నిర్దేశించుకోవాలన్నారు. కృషి, అంకితభావం, పట్టుదల ద్వారా సాధ్యమవుతుందన్నారు. మహిళా దక్షిత సమితి అధ్యక్షురాలు డాక్టర్‌ సరోజ్‌ బజాజ్‌, సుమన్‌ కళాశాల ప్రిన్సిపల్‌ రమాకుమారి, సుశీల, కళాశాల అధ్యాపక ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

మహిళకు ఆర్థిక సాయం



చందానగర్‌: అనారోగ్యంతో బాధపడుతున్న ఓ మహిళకు హోప్‌ ఫౌండేషన్‌ ఆర్థికంగా చేయూతనిచ్చింది. శనివారం చందానగర్‌లోని కార్యాలయంలో లక్ష్మికి రూ. 20 వేల చెక్కును ఫౌండేషన్‌ చైర్మన్‌ కొండ విజయ్‌ కుమార్‌, ఎస్‌బీఐ అసిస్టెంట్‌ జనరల్‌ మేనేజర్‌ భాస్కర్‌, రీజియన్‌ మేనేజర్‌ వెంకట్‌ నారాయణలు అందజేశారు

వ్యక్తి అదృశ్యం



భిక్షపతి

మియాపూర్‌: ఓ వ్యక్తి అదృశ్యమైన సంఘటన మియాపూర్‌ పోలీస్‌ స్టేషన్‌ పరిధిలో చోటుచేసుకుంది. వివరాలివీ... మదీనాగూడ వెంకటేశ్వరనగర్‌కు చెందిన పిట్టల భిక్షపతి(48) స్థానికంగా కూలీ పనులు చేస్తూ జీవనం కొనసాగిస్తున్నాడు. ఈ నెల 23వ తేదీన మధ్యాహ్నం ఇంట్లో చెప్పకుండా వెళ్లిపోయాడు. రాత్రి అయినా తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు బంధువులు, చుట్టుపక్కల ఎంత వెతికినా ఆచూకీ లభ్యం కాలేదు. దీంతో మియాపూర్‌ పోలీస్‌ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

సమాజం పట్ల బాధ్యతగా మెలగండి

- న్యాయరంగం భవిష్యత్‌ తరాలకు ఆదర్శంగా ఉండాలి
- ఓయూ వైస్‌ చాన్స్‌లర్‌ కుమార్‌ మెలుగారం
- విశ్వభారతి లా కాలేజీలో ఘనంగా గ్రాడ్యుయేషన్‌ డే

పటాన్‌చెరు టౌన్‌: నిరంతర అధ్యయనం వల్లే ఉన్నత స్థాయికి చేరుకోగలమని, న్యాయ విద్య పట్టాలను అందుకున్న విద్యార్థులు సమాజం పట్ల మరింత బాధ్యతగా మెలగాలని ఉస్మానియా యూనివర్సిటీ వైస్‌ చాన్స్‌లర్‌ కుమార్‌ మొలుగారం అన్నారు. శనివారం పటాన్‌చెరు మండలం ముత్తంగిలో విశ్వభారతి లా కాలేజీ నిర్వహించిన గ్రాడ్యుయేషన్‌ డే కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. 2020– 2023, 2021–2024లలో న్యాయ విద్యను పూర్తి చేసుకున్న విద్యార్థులకు పట్టాలను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా వీసీ కుమార్‌ మాట్లాడుతూ.. న్యాయ రంగంలో భవిష్యత్‌ తరాలకు ఆదర్శంగా ఉండేలా కొత్త ప్రయాణం ప్రారంభించాలని సూచించారు. గౌరవ అతిథిగా హాజరైన ప్రొఫెసర్‌ ఖాశీం మాట్లాడుతూ.. న్యాయవాదులు రాసే పిటిషన్‌ ఒక జీవితాన్ని నిలబెడుతుందనే విషయాన్ని గుర్తుంచుకోవాలని చెప్పారు.



పట్టా ప్రదానం చేస్తున్న వైస్‌ చాన్స్‌లర్‌ కుమార్‌, ప్రొ. ఖాశీం, కళాశాల కరస్పాండెంట్‌ రవి అనంత

డ్రాఫ్టింగ్‌ ఎంత బాగా రాస్తారనే విషయాన్ని బట్టే న్యాయవాది ఎదుగుదల ఉంటుందని పేర్కొన్నారు. లా డిగ్రీ చాలా అత్యుత్తమమైనదని, దాన్ని సమాజ హితం కోసం సద్వినియోగం చేయాలని కోరారు. అనంతరం 2021–24 విద్యా సంవత్సరానికి సంబంధించి 'అనంత రాజమ్మ స్మారక అవార్డు'లను అందించారు. వెంకట మధుకుమార్‌ గోల్డ్‌ మెడల్‌ అందుకోగా, సిల్వర్‌ మెడల్‌ను భాగ్యవతి దక్కించుకున్నారు. కార్యక్రమంలో విశ్వభారతి లా కాలేజీ కరస్పాండెంట్‌ రవి అనంత, ప్రిన్సిపాల్‌ డాక్టర్‌ భవాని, ఫ్యాకల్టీ సభ్యులు తేజశ్రీ, కీర్తి, రమ్యశ్రీ, గురుమూర్తి పాల్గొన్నారు. పట్టాలు అందుకున్న విద్యార్థులు తమ కుటుంబ సభ్యులు, స్నేహితులతో ఫొటోలు దిగుతూ ఆనందం వ్యక్తం చేశారు. మొత్తం 248 మందికి పట్టాలు అందించారు.

గుర్తుతెలియని మహిళ మృతి



చందానగర్‌: గుర్తు తెలియని మహిళ మృతి చెందిన సంఘటన చందానగర్‌ పోలీస్‌ స్టేషన్‌ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల సమాచారం మేరకు... శనివారం మధ్యాహ్నం లింగంపల్లి రైల్వే స్టేషన్‌ ప్లాట్‌ఫాం 1వ వైపు స్థానికంగా యాచిస్తూ జీవనం సాగించే గుర్తు తెలియని మహిళ (45) పడి ఉండడాన్ని స్థానికులు గమనించారు. ఈ సమాచారం అందడంతో చందానగర్‌ పోలీసులు ఘటన స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్ట్‌మార్టమ్‌ నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.


ఇందిరమ్మ ఇళ్ల సర్వే పరిశీలన

పటాన్‌చెరు టౌన్‌: చిట్కుల్‌లో నిర్వహిస్తున్న ఇందిరమ్మ ఇళ్ల సర్వేను శనివారం పటాన్‌చెరు ఎంపీడీఓ యాదగిరి పరిశీలించారు. గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకున్న ప్రజల ఇళ్లకు సర్వే బృందాలు వెళ్లి తనిఖీ చేస్తున్నారు. సర్వే బృందం ఇంటిని, దరఖాస్తు దారుల ఖాళీ జాగాను ఫొటో తీసి అప్‌లోడ్‌ చేస్తున్న తీరును చూశారు. ఎన్ని ఇళ్లు సర్వేపూర్తి చేశారని పంచాయతీ సిబ్బందిని అడిగారు. కారోబార్‌ క్రిష్టయ్య గ్రామం నుంచి 1708 దరఖాస్తుల వచ్చాయని వాటిలో 918 ఇళ్లలో సర్వే పూర్తి చేసుకున్నామని తెలిపారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ.. చిట్కుల్‌లో, ఇస్నాపూర్‌, రుద్రారం, క్యాసారం గ్రామాల్లో సర్వే నెమ్మదిగా జరుగుతుందని తెలిసి పరిశీలనకు వచ్చానన్నారు.

ఏఐ రంగంలో రాణించాలి

డీఎల్‌ఆర్‌ఎల్‌ శాస్త్రవేత్త డాక్టర్‌ ఏకే సింగ్‌

మణికొండ: రాబోయే రోజుల్లో ఆర్టిఫిషియల్‌ ఇంటలిజెన్స్‌ అన్ని రంగాలలో విస్తరిస్తుందని, అందులో ఇంజినీరింగ్‌ విద్యార్థులు అవగాహన పెంచుకుని, తమ ఇన్నోవేషన్‌లలో దాన్ని చేర్చుకుని రాణించాలని డీఎల్‌ఆర్‌ఎల్‌ శాస్త్రవేత్త, ప్రాజెక్ట్‌ డైరెక్టర్‌ డాక్టర్‌ ఏకే సింగ్‌ అన్నారు. ఇనిస్టిట్యూట్‌ ఆఫ్‌ ఇంజినీర్స్‌, మహాత్మాగాంధీ ఇనిస్టిట్యూట్‌ ఆఫ్‌ టెక్నాలజీ కళాశాలలు సంయుక్తంగా నిర్వహించిన ఏరోస్పేస్‌, రక్షణ రంగాలలో సాంకేతిక పురోగతిలో కృత్రిమ మేధస్సు పాత్ర అనే అంశంపై రెండవ రోజు గండిపేటలోని ఎంజీఐటీ కళాశాలలో సెమినార్‌ ముగింపు కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కృత్రిమ మేధస్సు రంగంలో రాబోయే రోజుల్లో అనేక ఉద్యోగావకాశాలు ఉంటాయన్నారు. దాన్ని అందిపుచ్చుకునేందుకు విద్యార్థులు సంసిద్ధులు కావాలన్నారు.



మాట్లాడుతున్న ఏకే సింగ్‌

వేర్వేరు ప్రాంతాల్లో ఇద్దరి ఆత్మహత్య

గచ్చిబౌలి: వేర్వేరు ప్రాంతాల్లో ఇద్దరు ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డారు. గచ్చిబౌలి పోలీసుల సమాచారం మేరకు... మంచిర్యాల జిల్లా బెల్లంకొండకు చెందిన జంజర్ల నరేందర్‌(46) బాచుపల్లిలోని అపూర్వ అపార్ట్‌మెంట్‌లో నివాసం ఉంటున్నాడు. గచ్చిబౌలిలోని మై హోం విహంగలో హౌస్‌ కీపింగ్‌ మేనేజర్‌గా పని చేస్తున్నాడు. శుక్రవారం ఉదయం 11.30 గంటలకు డ్యూటీకి వచ్చి తోటి ఉద్యోగులతో మీటింగ్‌ నిర్వహించాడు. మధ్యాహ్నం లంచ్‌ చేసే సమయంలో ఉద్యోగులు ఫోన్‌ చేసినా స్పందించలేదు. హౌస్‌ కీపింగ్‌ పనులు చేసే సురేష్‌ అనే వ్యక్తి క్రిస్మస్‌ ట్రీని స్టోర్‌ రూమ్‌లో భద్రపరిచేందుకు వెళ్లగా అక్కడ సీలింగ్‌ ఫ్యాన్‌కు ఉరి వేసుకొని చనిపోయి ఉన్నాడు. వెంటనే గచ్చిబౌలి పోలీసులకు సమాచారం అందించారు. మృతికి గల కారణాలు తెలియరాలేదని పోలీసులు తెలిపారు. మృతునికి భార్య మీన, కొడుకు, కూతురు ఉన్నారు.

భర్త మందలించాడని గృహిణి...

అనారోగ్యంతో బాధపడుతున్న కూతురును సరిగా చూసుకోవడం లేదని భర్త మందలించడంతో క్షణికావేశానికి గురైన వివాహిత ఆత్మహత్యకు పాల్పడింది. గౌలిదొడ్డిలోని తుముతుగొల్ల స్వాతి(23) శనివారం ఉదయం భర్త నర్సింహా రాళ్లు కొట్టేందుకు వెళ్లాడు. ఉదయం 11 గంటల సమయంలో అత్త మంజుల వచ్చి చూడగా గుడిసె కర్రకు చున్నీతో ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. మృతదేహానికి ఉస్మానియా ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించారు. 18 నెలల కూతురు అనారోగ్యంతో బాధపడుతుండగా కొంత కాలంగా స్వాతి ఇంట్లోనే ఉంటోంది. కూతురును సరిగ్గా చూసుకోవడం లేదని భర్త నర్సింహా మందలించాడు. మనస్తాపానికి గురైన స్వాతి ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఆత్మహత్యకు పాల్పడిందని పోలీసులు తెలిపారు. ఈ మేరకు పోలీసులు వేర్వేరు కేసులను నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ఎంజీఐటీలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం

మణికొండ: గండిపేటలోని మహాత్మాగాంధీ ఇనిస్టిట్యూట్‌ ఆఫ్‌ టెక్నాలజీ (ఎంజీఐటీ) కళాశాలలో శనివారం సాయంత్రం పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. దేశ, విదేశాలలో స్థిరపడిన పూర్వ విద్యార్థులు వచ్చి తమ కళాశాల నాటి రోజులను స్మరించుకున్నారు. తమకు పాఠాలు బోధించిన అధ్యాపకులను కలిసి వారి యోగ క్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఇటీవల కళాశాలలో సాధించిన ప్రగతిని తెలుసుకున్నారు. కళాశాల అభివృద్ధికి తమ విలువైన సూచనలు, సలహాలను అందించారు. రాబోయే రోజుల్లో కళాశాల అభివృద్ధికి తమ వంతు సహకారం అందిస్తామన్నారు.



కళాశాలలో కలుసుకున్న పూర్వ విద్యార్థులు

దశాబ్దాల కల నెరవేరబోతోంది..

- త్వరలో ఇంటిగ్రేటెడ్‌ రైతుబజార్‌ ప్రారంభం
- అన్ని వస్తువులు ఒకేచోట లభ్యం



ప్రారంభోత్సవానికి సిద్ధమవుతున్న ఇంటిగ్రేటెడ్‌ రైతుబజార్‌

రామచంద్రాపురం(పటాన్‌చెరు): రామచంద్రాపురం పట్టణవాసులు 20ఏళ్లుగా ఎదురుచూస్తున్న రైతుబజార్‌ త్వరలో ప్రారంభం కానుంది. కూరగాయల మార్కెట్‌ లేక స్థానికులు చుట్టూ పక్కల ప్రాంతాల్లో జరిగే వారాంతపు సంతాలు, లింగంపల్లిలోని రైతు బజార్‌కు వెళ్లి తెచ్చుకోవాల్సిన పరిస్థితి. 2004లో రామచంద్రాపురం గ్రామపంచాయతీగా ఉన్న సమయంలో బొంబాయికాలనీలో రూ.40లక్షలతో రైతు బజార్‌ను నిర్మించారు. అప్పటి నుంచి 2021వరకు అందులోకి వ్యాపారస్తులు, రైతులు రాకపోవడంతో ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి, నాటి ఎమ్మెల్సీ వెన్నవరం భూపాల్‌రెడ్డి 2021లో రైతుబజార్‌ను ఇంటిగ్రేటెడ్‌ మార్కెట్‌గా మారుస్తూ ప్రత్యేక నిధులను మంజూరు చేయించారు. ప్రస్తుతం పనులు పూర్తయి ప్రారంభోత్సవానికి సిద్ధమవుతోంది.

అన్ని వస్తువులు ఒకేచోట..

నూతనంగా నిర్మిస్తున్న ఇంటిగ్రేటెడ్‌ రైతుబజార్‌లో అన్ని వస్తువులను విక్రయించేలా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. తాజా కూరగాయలు. పండ్లు, పూలు. మాంసం, నిత్యావసర సరుకులు అందుబాటులో ఉండేలా రైతుబజారును నిర్మిస్తున్నారు.

మెరుగైన వసతులు..

రైతులకు, వ్యాపారస్తులకు, వచ్చే ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా తాగునీరు, మరుగుదొడ్లు, చిన్నారులకు ఆటవస్తువులు, వాహనాల పార్కింగ్‌, సీసీ కెమెరాలను ఏర్పాటు చేస్తున్నారు.

104దుకాణాలు ఏర్పాటు..

రైతుబజారులో నాలుగు భారీ షెడ్లను నిర్మించారు. అందులో 104 దుకాణాలను ఏర్పాటు చేశారు. కూరగాయలకు, మాంసం, పండ్లు.. దేనికి అది విడివిడిగా చేశారు. త్వరలో ఇంటిగ్రేటెడ్‌ రైతుబజారును నెలరోజుల్లో ప్రారంభించనున్నట్లు ప్రజాప్రతినిధులు సిద్ధమవుతున్నారు.